# మిథ్యావాది రూపాంతరం

కె. రామలక్ష్మి

కథానిక

"ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. అయినా ఎవరికి కావలసినది వాళ్లు యితమిత్థంగా తేల్చుకోలేక ఏది దొరికితే దాన్నే అందుకుంటూ నిస్పృహతో జీవితాలు నెట్టేస్తూ వుంటారు. పాపం వాళ్ళననుకుని ఏంలాభం? యీ జీవితంమీద యింతటి మమకారం ఏమిటి అని నీలాంటివాళ్ళు నవ్వుతే ఏమయినట్లు? ఈ ప్రపంచంలో బ్రతికినన్నాళ్ళూ డిటాచ్‌మెంటు ఎలాగా కుదరదు కనుక, నాలాంటివాళ్ళు నాన్ ఎటాచ్‌మెంట్‌నే అమల్లో పెట్టడానికి ప్రయత్నిస్తారు. నీలాంటి యీ లోకపు మనిషికి నవ్వేవస్తుంది మరి" పార్వతి యింకా సాగించును కాని చాలాసేపాయి కృష్ణమూర్తి చెవులు మూసుకోవడం చూచింది. తీయడా అనుకుంది. కాని తీయకపోవడంతో ఊరుకోకతప్పిందికాదు. పార్వతీ అగ్గానే అన్నాడు: "అయిందా బాబూ, నీ వేదాంతసార బోధన!" అంటూ కుర్చీలో చేరబడ్డాడు.

"అవునులే, నిజంచెప్తే నీలాంటివాళ్ళకి, కాదు, కాదు, నీల్లాంటి యీ లోకపు మనుష్యులకి అలాగే వుంటుంది" అంటూ వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

పార్వతి జీవితంలో, అందులో తనతోటి జీవితంలో ఏ ఒక్కరోజు తీసుకొన్నా చాలు—యీ వేదాంతపు లోతు ఎంతటిదో తెలుసుకుందుకు అని నవ్వుకున్నాడు కృష్ణమూర్తి... కుర్చీలో జేరబడి తీరుబడిగా సిగరెట్టు ముట్టించిన కృష్ణమూర్తిని ఏవేవో ఊహలుచుట్టుముట్టాయి. వద్దనుకుంటున్నా అనేకం అతనిచేత దీర్ఘంగా ఆలోచింపచేస్తున్నాయి

పార్వతిని తొలిసారిగా ఒకసారి చూశాడు. ఎవరీవిడ అంటూ అందరి కాలేజీ కుర్రాళ్ళలాగే ఎడ్రసుకోసం వెన్నంటామెని. కాని కాలం ఖర్మం కలిసిరావడంతో అతిసన్నిహితుడు ప్రియమిత్రుడు రాధాయి చెల్లెలే యీ పార్వతి అని తెలుసుకున్నాడు ఎంతటి ఉత్సాహం కృష్ణమూర్తిలో రేకెత్తిందో—ప్రతిక్షణానా యీనాటికీ ఏదోఒకనూతన విషయం పార్వతి కదలికలో మాటలో, చేష్టలో గోచరించి అంతటి ఉత్సాహమూ కల్గుతూనేవుంది. ఎటొచ్చీ ఆనాటి పార్వతిని ఎలాగా తన వైపు మళ్ళించుకోవడం అన్న చింతన యీనాడులేదు. కాని యీనాడూ ఒకలాంటి ఆందోళన కృష్ణమూర్తికి లేకపోలేదు. పేపరులో వాతావరణ స్థితివార్తల నెంతగా నమ్మవచ్చో పార్వతి మూడ్సునీ అంతే. ఈ క్షణాన ఉత్సాహంలో మరిసే ఆమె కళ్ళు మరుక్షణాన అగాధాల్లాంటి ఆలోచనలను నింపుకుంటాయి.

ఆ రోజుల్లో పార్వతి నిరాడంబరి. అవునో కాదో తెలియదు కాని అందరి కళ్ళకీ అలా కనిపించేది. మల్లెల్లాంటి తెల్లని బట్టలలో అందరి దృష్టినీ మరీ ఆకర్షించేది. అసలు కొందరు అందరినీ ఆకర్షించడానికి అపరిమితంగా అలంకరించుకుంటారు. మరికొందరు ఏ ప్రత్యేకతా కూడదని నిరాడంబరంగా వుండడంలోనే అందరి దృష్టినీ ఆకర్షిస్తారు. పార్వతి రెండో తెగకి చెందుతుంది.

రాధాయి చెప్తూండేవాడు: పార్వతి శుద్ధ నాన్నపోలిక అని. నాన్నగారు సర్వసౌఖ్యాలూ అనుభవించేసి కన్నుమూసేశారు. తల్లి కంట్లో కలికం పెట్టుకుని యిద్దరు పిల్లలనీ పెంచి పెద్దవాళ్ళను చేసింది. కాని రాలుగాయలుగా తయారయారనే చింతను అనుభవించకుండానే ఆవిడ కన్నుమూసింది. ఇక మిగిలింది అన్నా చెల్లీ, ఆస్తీను. రాధాయి చెల్లెలికి తల్లీ తండ్రీ బంధు కోటీ అయి, చూసుకున్నాడు. వానిఫలితమే పార్వతి మొండితనం. మంకుతనం. అతి ధైర్యం. అయినా అన్నాయికి చెల్లెలంటే ప్రాణం. ఎప్పుడేనా వేళాకోళానికి యిప్పటికీ కృష్ణమూర్తి అంటూంటాడు. 'ఒరేయి రాధాయి, నువ్వు నిజంగా మార్కండేయుడివిరా. అటువంటి చెల్లెలితో బతికీ ఆయుర్దాయం కొరవడలేదంటే!" పూర్తి కానివ్వకుండానే పార్వతి అందుకుంటుంది. "పోనీలేతుండూ, అందుకేగా నీకూ

ప్రాప్తించాను. మార్కండేయ ఆయుర్దాయం నా చేతిలో పెట్టి పోయాడు" ఎవరూ! అంటాడు అప్రయత్నంగా రాధాయి 'ఇంకెవరురా, మా నాన్నా, యమధర్మరాజూనూ.' అంటుంది పార్వతి సాగతీసుకుంటూ.

'ఛీ, కళ్లుపోతాయి పెద్దాళ్ళనలా అంటే' అంటాడు కృష్ణమూర్తి.

'ఇదెప్పటినుంచీ. అయినా నాన్నని యమధర్మ రాజంటే తప్పులేదు. ఎటువంటి కర్కోటకుడు కాకుంటే యిటువంటి వాళ్ళ పాలికి నన్నొదిలి పోతాడు?' అనేది. పార్వతినిగురించిన ఊహలు కదిలాయంటే పొగలలా యిక అలా ప్రయాణం చేస్తాయి. మొదట్లో రాధాయి చెల్లెలు యీమె అని ఓ పట్టాన నమ్మలేక పోయాడు కృష్ణమూర్తి. కాని రానురాను తరుచు రాధాయి యింటిలో యీమె దర్శన సౌభాగ్యం లభించి నమ్మేడు. అతనెప్పుడెళ్ళినా పార్వతి ఏదో కోపంగానే మాట్లాడుతూ వుండేది. 'ఎందుకురా మీ చెల్లెకి కంతకోపం?" నవ్వుతూ ప్రశ్నిస్తే, 'అదంతేలేరా, ఏమిటీ మనుషుల తత్వం? ఎందుకిలా స్వార్థంకోసం చచ్చిపోతారు? అంటూ నిలవేసి నన్నడుగుతే నేనేం చెప్తానురా? నువ్వు చెప్పకలవేమో చెప్పు' అనేవాడు రాధాయి. 'ఆఁ మీ ప్రాణస్నేహితుడే చెప్పాలి. పాపం, యీ జీవితం అంటే ముట్టనట్టు తామరాకుపై నీటిబిందువులా గడిపేస్తున్నాడు కదూ!'వ్యంగ్యంగా అనేసిఅక్కడినుండివెళ్ళిపోయేది.

పార్వతిని నాల్గు సంవత్సరాలపాటు అలా చూస్తూనే వచ్చాడు. ఆ నాల్గు సంవత్సరాల లోనూ మానసికంగా పార్వతి ఓ అంగుళం అయినా పెరగలేదు. ప్రతి పుట్టినరోజుకీ ఒక 'మంచి' చీర, ప్రతి పండగకీ బహుమానం, స్నేహితులూ, విందులూ, వినోదాలూ ఏ ఒక్కటీ ఎప్పుడూ మానలేదు. కాని కొన్నికొన్ని సమయాల్లో ఆమె మాటలు విని కృష్ణమూర్తి అచ్చెరు వందేవాడు. ఇంత యీ లోకపు మనిషై బతుకుతూ పార్వతి అంతా మిథ్య అన్న ధోరణిని వుండివుండి జ్ఞప్తికి తెస్తూండేది. ఎప్పుడేనా, అనుకోకుండా సాయంత్రాలవేళ వస్తే-హాలు కిటికీలో కూర్చుని తెగని ఆలోచనలలో మునిగిన పార్వతి కన్పించి ఏదోలా అనుకునేవాడు: ఈ బాహ్య ప్రపంచపు సర్వస్వాన్నీ మరిచి ఏమిటి ఆలోచిస్తూంది? తన కేం లోటయిందని యిలాంటి వెర్రి వేదాంతం? అనుకునేవాడు. అటువంటి సమయాల్లో పార్వతి గారూ, రాధాయి వున్నడా? అంటూ అడిగితే ఒకొక్కసారి 'రండి, కృష్ణమూర్తీ. అన్నాయి ఎక్కడికో వెళ్ళాడు. రండి లోపల కూర్చుని కబుర్లు చెప్పుకొందాం' అంటూ అత నొంటరిగా వస్తాడా అన్న అవకాశంకోసం ఎదురుచూసే వ్యక్తిలా మాట్లాడేది, లేదా ఒకొక్కసారి ఏం మనుషులో బాబూ, ఓ క్షణం ఎవరికి వారిని బతక నీయరు అంటూనే సమాధానం చెప్పేది. ఇటువంటి పార్వతిమీద తన ఆశాసౌధాన్ని రోజుకి రోజు దారుణంగా పెంచేశాడు. పేకముక్కల మేడలా అదే క్షణానేనా కూలిపోవచ్చునని తెలిసీ కట్టకుండా వుండలేకపోయాడు. పార్వతిలో విడి వడకుండా కలసిపోయిన భిన్న మనస్తత్వాలు అతన్ని అయాస్కాంతలా ఆకర్షించాయి. కొన్ని సమయాలలో వాటివల్ల అతను పొందిన సంతోషం తృప్తికంటే, బాధే ఎక్కువ. ఏ సందర్భంలో పార్వతి తనతో మనసిచ్చి చనువుగా మాట్లాడుతే బాగుండునని అతని హృదయం ఆరాటపడేదో, ఆ క్షణానే పార్వతి ఎక్కడలేని చిరాకూప్రదర్శించేది.

కాలం గడచినకొద్దీ ... పరిస్థితులు అనుకోకుండా మారిపోవడం, ఓ సుముహూర్తాన నలుగురు స్నేహితులమధ్య వైభవోపేతంగా కాకున్నా అందరికీ సంతోషం కల్గేలా వివాహం జరిగిపోవడం జరిగింది. ఆ రోజునుంచైనా పార్వతి మనసిచ్చి తనతో మామూలుగా వుంటుందనుకున్న కృష్ణమూర్తికి నిరాశే కల్గింది.

...పార్వతిలో కొత్త ఉత్సాహం వచ్చింది. యిన్నాళ్లూ ఏ వ్యక్తికోసం తను అనేక అడ్డదారుల వ్యూహ్యాలు పన్ని ఉచ్చులువేసిందో ఆ శ్రమంతా ఫలించింది. కృష్ణమూర్తి సుడిగాలి, కృష్ణమూర్తి దారం ఎవరిచేతాలేని గాలిపటం అనుకుంది. కాని యీనాడు తెలిసింది: ఆ సుడిగాలిని తాను అరికట్టి తనది చేసుకుంది. ఆ గాలిపటానికి దారం తనచేత వుంచుకోకల్గింది. ఫలితమే కృష్ణమూర్తి యింటి పట్టున వుండడం; పార్వతికోసం తాపత్రయపడడం.

తన చేతుల్లోనే వున్నా వుండుండి పార్వతి కొన్ని యోజనాలదూరంలో వున్నట్లు, అసలిక్కడ

లేనే లేనట్లు అనిపిస్తుంది తనకి. తనేం లోటు చేశాడని—అన్న ఆలోచనలో పడిపోతాడు. ఒకనాటి పార్వతి ధోరణికి బాధకల్గి కృష్ణమూర్తి కోపంగానే అన్నాడు: "అయితే నన్నెందుకు పెళ్ళిచేసుకుందుకు ఒప్పుకున్నావ్? యింత వైరాగ్యం వున్నదానివి సంసారపుటూబిలో రెండుకళ్ళూ తెరిచే ఎందుకు దిగావు పార్వతీ?" కోపాన్నంతా మింగేసి గట్టిగా కౌగలించుకోనేలా చేసింది. చిలిపిగా చూస్తూ "నిన్ను ఉద్ధరిద్దామని. చూడు తుండూ, నేనే నిన్నిలా కట్టేసుకోకపోతే మరీ పాపివయిపోదువు. ఇప్పుడు...చిన్న చిన్న పాపాలు చేసినా తిరిగి ప్రాయశ్చిత్తానికి అవకాశంవుంది నాచెంత. చూడూ, నూరు యోజనాల తాడుతో నా పెంపుడు జంతువును కట్టేసుకున్నాను. అదెంతంత దూరం మేయడానికి పోయినా తిరిగిరాక తప్పదు. ఏమంటావు?"

ఏమంటాడు?

కుర్చీలో కూర్చున్న కృష్ణమూర్తికి కొద్దిమాసాలలో పార్వతిలో శీఘ్రగతిని వచ్చిన మార్పులు జ్ఞాపకంవచ్చి నవ్వొచ్చింది. ఎందుకొచ్చిన బాదరబందీ యిదంతా అంటూ ప్రతిరోజూ విసుక్కుంటూ కాలక్షేపంచేసే పార్వతి కొద్దిరోజుల క్రితం "తుండూ, నాకో చక్కని తెల్లచీర కొనిపెట్టు" అంటూ అతని రేగిన జుట్టు సవరించింది. "ఎందుకు పార్వతీ, ఏంశాశ్వతం చెప్పూ?" అంటూ దగ్గరకి తీసుకున్నాడు. "యిదే శాశ్వతం కృష్ణా. యిన్నాళ్ళకి నాకో సంగతి మెరపులా మెరిసి అర్థం అయింది: అందరూ తమకేంకావాలో యిదమిత్థంగా తేల్చుకోకుండా ఏ దారి కన్పిస్తే దాన్నే ఆధారం చేసుకుంటారుకాని నేనలా చేయలేదు." "అది ఎలా నమ్మడం?" "నువ్వు నమ్మకపోతే నాకేం?" అంటూ వెళ్ళిపోయింది లోనికి. నాటినుండీ కృష్ణమూర్తి గమనిస్తూనే వున్నాడు. పార్వతి మారిపోయింది. జీవితంపట్ల ఏదో తెలియని కొత్త ఉత్సాహం ఆమెలో రేకెత్తింది. అది ఆమె చేసే ప్రతి పనిలోనూ ప్రతిబింబిస్తూనే వుంది...అందుకే యీనాడు "నువ్వేలోకం మనిషివి. అందరికీ డిటాచ్‌డ్‌గా బ్రతకడం కుదరదు కనక నాన్ ఎటాచ్‌డ్‌గా నేనా వుంటారు." అంటూ పార్వతి మాట్లాడుతూంటే హాస్యాస్పదంగా వుంది...ఆలోచనలు ఇంకా అలాసాగుతూనేవున్నాయి. ఎప్పుడు వచ్చిందో పార్వతి వచ్చి అతని కుర్చీ చేతిమీద కూర్చుని అతని తలనిమురుతూంది. బరువైన రెప్పల క్రింద తెల్లనికళ్లు మెరుస్తున్నాయి. "వంట అయిందా పార్వతీ," అంటూ నడుముచుట్టూ చేయివేశాడు. చెంపని అతని తలకి ఆనుస్తూ 'అయింది కాని ఏమిటి ఆలోచిస్తున్నావు? ఎవర్ని గురించి?' కొంటెగా ప్రశ్నించింది. "నిన్ను గురించే" అన్నాడు. 'కాదు, నన్నుగురించి అంత ఆలోచించడానికేం వుందీ. నేను నా భార్యని, భార్యలని గురించి తల పట్టు పట్టే ఆలోచనలు అసంభవం.' "అయితే ఎవరినిగురించంటావ్!" చిలిపిగా అడిగాడు. "ఏమో నా కెలా తెలుస్తుందీ, అంత రహస్యం కాకుంటే చెప్పు." అంటూ నిల్చుంది. యిక ఎలాగాకోపం వస్తుంది. ఎలాగా ఏదో అని లేచి లోపలికి వెళ్ళిపోతుంది. అందుకే అన్నాడు. "ఈ ప్రపంచంలో ఏదైనా సరే, శాశ్వతంగా వుంటుందా? పోనీ మనం బ్రతికున్నాళ్ళూ అయినా సరే. చూడు పార్వతీ, ఆలా చక్కని వూహాలు యిప్పటిదాకా కొన్ని శాశ్వతమనే తోస్తాయి నాకు. కాని అవలాగే వుండి పోతాయో, లేక, నీవేదంత ధోరణిలాగా, వాతావరణంలాగా మారిపోతాయో" యింకా మాట్లాడబోతూన్న కృష్ణమూర్తిని ఆపి, "విను తుండూ, యీ ప్రపంచంలో నీకు కొన్ని మధుర స్మృతులూ నాకు కొన్ని కొరుకుపడని క్షణాలూ శాశ్వతంగానే వుంటాయి. నీకు నీ వసంతోహాలు శాశ్వతం. చిత్తచిత్తగించినా స్వాతిచల్లగావున్నా అనూరాధ మనోరాధాలు ఈడేర్చేదే అన్న చింతన శాశ్వతం, యీ పార్వతి శాశ్వతం. ఇక నా కంటావా? నా కలాంటివి చాలా శాశ్వతమైన వూహాలు నీ పట్లవున్నాయిలే...అంచేత యింక ఆలోచించకు లే అన్నం తిందాం.'

"ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ జీవితం అంటే యింతటి మమకారం కూడదు. పార్వతీ. ఏం కూర చేశావ్?" సీరియస్‌గా అడిగాడు కృష్ణమూర్తి.

"కాకరకాయ"

"చూడగా చూడగా కాకరకాయ ఒక్కటే శాశ్వతంగా కనిపిస్తూంది. ఏంచేస్తాంలే." అంటూ నవ్వుతూన్న పార్వతిని అనుసరించాడు. ★